సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 16 । డిసెంబర్ । 2024



క్రికెట్ క్లబ్‌ల సందడి

క్రికెటర్లకు ప్రోత్సాహం అందుతోంది. క్రికెట్ క్లబ్‌ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

- 8లో



మోసాలు తెలిసి అవాక్కయ్యాం

ఆర్మీ కాలింగ్ సెంటర్ రమణ మోసాలు బయటపడుతున్నాయి. బాధితులు బయటకు వస్తున్నారు.

- 8లో

29న కోటి దీపోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 29న అష్టలక్ష్మి పుష్పయాగ సహిత కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు విజయగణపతి ఆలయం, విజయదుర్గా ఆలయం అర్చకులు పెంట శ్రీధర్ శర్మ, ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పాశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మచే ప్రవచనం ఉంటుందని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

న్యూస్‌రీల్

అవకాశాలు సద్వినియోగం చేసుకోండి



పూర్వ విద్యార్థులతో కలసి సమావేశానికి హాజరైన ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సరుబుజ్జిలి: అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని వైఎస్సార్ కడప జిల్లా జవహర్ నవోదయ పూర్వ విద్యార్థి ఐటీడీఏ (సీతంపేట) పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం విద్యాలయం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి గత అనుభవాలు, ప్రస్తుత స్థితిగతుల గురించి కాసేపు ముచ్చటించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘం ఏర్పాటు చేసుకున్నారు. సంఘం ప్రెసిడెంట్‌గా నాగరాజు, వైస్ ప్రెసిడెంట్‌లుగా వినోద్‌కుమార్, అశోక్, సెక్రటరీ సతీష్, జాయింట్ సెక్రటరీ సుధాకర్, సునీత, ట్రెజరర్ అంబేడ్కర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఏడుగురికి గాయాలు



తీవ్రగాయాలకు గురైన మణికంఠకు చికిత్స చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

టెక్కలి రూరల్: మండలంలోని డమర గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నర్సింగపల్లి గ్రామానికి చెందిన పోలాకి మణికంఠ అనే యువకుడు అయ్యప్ప మాల తీసి ఆదివారం ఉదయం తన ఇంటికి వచ్చాడు. రాత్రి సినిమాకి వెళ్లేందుకు తన బంధువులు పోలాకి చైతన్య, పోలాకి యువరాణి, పోలాకి జగదీశ్వరితో కలసి ఒకే బైక్‌పై టెక్కలి బయల్దేరారు. అలాగే టి.గోవింద్ అనే యువకుడు కూడా కె.తిరుపతిరావు, జి.లక్ష్మీకాంతం అనే ఇద్దరిని తన బైక్ ఎక్కించుకుని బైక్‌పై వస్తున్నాడు. ఈ రెండు వాహనాలు డమర గ్రామ సమీప మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. అదే సమయంలో అటుగా వచ్చిన మరో బైక్ కూడా అదుపు తప్పి పడిపోయింది. ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. వీరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కె.తిరుపతి రావు తల లోపలి భాగంలో గాయం కాగా పోలాకి మణికంఠ, యువరాణికి కాళ్లు విరిగినట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై స్థానికులు టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

ముగిసిన ఉత్తరాంధ్ర భక్త సమ్మేళనం



ఉపన్యసిస్తున్న స్వామి స్వసంవేద్యానంద

కాశీబుగ్గ: పలాస రామకృష్ణ నరేంద్ర యువజన సేవా సంస్థ, శ్రీరామకృష్ణ సేవా సమితి మంచినీళ్లపేట ఆధ్వర్యంలో పలాస వేదికగా ఉత్తరాంధ్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ భక్త సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. మూడు రోజులు పాటు జరిగిన సత్సంగంలో దేశవ్యాప్తంగా ప్రముఖ రామకృష్ణ మఠాలు, క్షేత్రాల నుంచి ప్రముఖ స్వామీజీలు విచ్చేసి ఉపన్యాసాలు ఇచ్చారు. స్వామి స్వసంవేద్యానంద మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మిక జీవనంలో ఉన్నవారు మాత్రమే పరిపూర్ణులు అవుతారని అన్నారు.

'వర్గీకరణతోనే మాదిగలకు మనుగడ'

కాశీబుగ్గ: ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఎస్సీ వర్గీకరణతో మాదిగ వర్గానికి మనుగడ లభిస్తుందని మాదిక రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పాతజాతీయ రహదారి పక్కన ఉన్న ఎంపీపీ స్కూల్‌లో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ కమిషన్ శ్రీకాకుళం వస్తోందని, అందరూ బయల్దేరి రావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపడానికి మాదిగ ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎంఎస్ సభ్యులు వస్తారని తెలిపారు.



ప్రయోగం లేదా..?

- జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్‌కు నోచుకోని విద్యార్థులు
- ప్రైవేటు కాలేజీల్లో ఇంకా బూజు దులపని సైన్స్ ల్యాబ్‌లు
- అపార్, కేర్‌టేకర్, సంకల్ప్, ఆన్‌లైన్ డేటా నమోదుతో సతమతం అవుతున్న లెక్చరర్లు
- ఫిబ్రవరి 10 నుంచి మొదలుకానున్న ప్రాక్టికల్స్
- ఆందోళనలో విద్యార్థులు



ప్రాక్టికల్స్‌కు సిద్ధంగా ఉన్న కెమిస్ట్రీ ల్యాబ్

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అత్యంత కీలకమైన ప్రయోగ పరీక్షలను ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఓ వైపు ప్రాక్టికల్ పరీక్షల తేదీలు ప్రకటించిన నేపథ్యంలో.. కాలేజీల్లో ఎంత వరకు ప్రయోగాలు పూర్తయ్యాయో పరిశీలిస్తే.. ఆశ్చర్యకర విషయాలు వెలుగు చూశాయి. అపార్, కేర్‌టేకర్, సంకల్ప్, ఆన్‌లైన్ డేటా నమోదు వంటి కార్యక్రమాలతో అధ్యాపకులను ప్రభుత్వం నిరంతరం బిజీగా ఉంచడంతో కాలేజీల్లో ప్రయోగాలు చేయించే వీలు లేకపోయింది. చాలా కాలేజీల్లో ల్యాబ్‌ల బూజు కూడా దులపలేదంటే అతిశయోక్తి కాదు. 2025 మార్చి 1 నుంచి థియరీ పబ్లిక్ పరీక్షలు జరుగుతుండగా.. సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 10 నుంచి మొదలై 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అధికారులు త్వరలో పరీక్ష కేంద్రాల కేటాయింపు కోసం జూనియర్ కాలేజీలను పరిశీలించనున్నారు. అక్కడ వసతుల కల్పన, సౌకర్యాల తీరును క్షుణ్ణంగా పరిశీలించి కేంద్రాల కేటాయింపునకు ప్రభుత్వానికి ప్రతిపాదన చేయనున్నారు.

సర్కారీ కళాశాలల్లో భిన్నమైన దుస్థితి..

మరోపక్క ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. అక్కడి లెక్చరర్లకు ఉదయం నుంచి సాయంత్రం పాఠాల కంటే అకడమిక్ వర్క్‌కే ఎక్కువ సమయం కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లెక్చరర్లకు పాఠాలు చెప్పడానికి తీరిక లేని పనులతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఒకవైపు అపార్ నమోదు కుదిపేస్తోంది. మరోవైపు సంకల్ప్ పేరిట ప్రత్యేక క్లాసులు, కేర్ టేకర్ వర్క్, ప్రత్యేకంగా పుస్తకాలు, విద్యార్థుల డేటా నమోదు, ప్రోగ్రెస్ కార్డుల తయారీ, ఆన్‌లైన్‌లో అటెండెన్స్, మార్కుల నమోదు, ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు డేటా తయారీతో సతమవుతున్నారు. దీంతో రెగ్యులర్ క్లాసులకే దూరమవుతున్నామని లెక్చరర్లు మదనపడుతున్నారు. ఈ నేపథ్యంలో సైన్స్ లెక్చరర్లు ప్రాక్టికల్స్ నిర్వహించలేని పరిస్థితి దాపరించిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వెంటనే ఇంటర్ విద్య కమిషనర్ చొరవ తీసుకుని క్లాసుల బోధన, ప్రాక్టికల్స్ నిర్వహణకు ఆటంకం లేకుండా మార్గదర్శకాల పునఃసమీక్షించాలని లెక్చరర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

30 మండలాలతో కూడిన శ్రీకాకుళం జిల్లాలో ఫంక్షనింగ్ జరుగుతున్న మొత్తం జూనియర్ కళాశాలలు 168 ఉండగా.. 40,876 మంది విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించారు. అలాగే ప్రాక్టికల్ పరీక్షలకు 14,920 మంది హాజరుకానున్నారు. వీరిలో ఎంపీసీ గ్రూపు నుంచి 10,113 మంది, బైపీసీ నుంచి 4,807 మంది ఉన్నారు. ఎంపీసీ గ్రూపునకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు, బైపీసీ గ్రూపునకు ఫిజిక్స్, కెమిస్ట్రీలతోపాటు బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో ప్రాక్టికల్స్ జరగనున్నాయి. చెరో సబ్జెక్టుకు 30 మార్కుల చొప్పున కేటాయించనున్న విషయం తెలిసిందే. జాతీయ, రాష్ట్రస్థాయిలో నిర్వహించే జేఈఈ, నీట్, ఏపీఈఏపీసెట్ (పాత ఎంసెట్) వంటి ప్రవేశ పరీక్షల్లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ ఉన్న నేపథ్యంలో ప్రాక్టికల్స్ మార్కులకు సైతం ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రిన్సిపాళ్లకు దిశానిర్దేశం చేశాం



జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఇప్పటికే పలుమార్లు దిశానిర్దేశం చేశాం. ప్రిన్సిపాళ్ల చొరవ తీసుకుని విద్యార్థులను బ్యాచ్‌లవైజ్‌గా కేటాయించి ప్రతి రోజు ప్రాక్టికల్స్ నిర్వహించాలి. అకడమిక్ పనులు చూసుకుంటూనే ప్రాక్టికల్స్‌కు సన్నద్ధం చేయాలి. తనిఖీలు చేపడతాం. ప్రాక్టికల్స్ ల్యాబ్‌ల్లో కావాల్సిన పరికరాలు, సదుపాయాలు సమకూర్చుకోవాలి.

– ప్రగడ దుర్గారావు, జిల్లా ఆర్ఐఓ, ఇంటర్మీడియెట్ బోర్డు

విద్యార్థులను సన్నద్ధం చేయాలి



షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సమాయత్తం చేయాలి. ఇప్పటికే ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను సిద్ధం చేసే పనిలో లెక్చరర్లు నిమగ్నమయ్యారు. ప్రైవేటు కళాశాల్లోను విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పై అవగాహన పెంచి వారిని సిద్ధం చేయాలి.

– శివ్వాల తవిటినాయుడు, జిల్లా డీవీఈఓ, ఇంటర్మీడియెట్ విద్య



ప్రాక్టికల్స్ జరిగేతే ఒట్టు..

పాత విధానంలో అంటే నాన్ జంబ్లింగ్ విధానంలో జరిగే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను అటు ప్రభుత్వం.. ఇటు అధికారులు లైట్ తీసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్పొరేట్ కాలేజీల కనుసన్నల్లో నడుస్తున్న ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ప్రాక్టికల్స్ నిర్వహణపై పకడ్బందీ చర్యలు తీసుకోకపోవడంతో ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రాక్టికల్స్ అంటే ఏంటో కూడా తెలీని పరిస్థితి నెలకొంది. కొన్ని సర్కారీ కాలేజీల్లో మినహా మిగిలిన ఏ జూనియర్ కాలేజీల్లోనూ ప్రాక్టికల్ క్లాసులు జరగడం లేదని అధికారులు గుర్తించారు. కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లో తమకు ప్రాక్టికల్స్ ల్యాబ్ ఉందనే విషయమే తెలియదని విద్యార్థులే బాహాటంగా చెబుతుండటం విశేషం.

30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు



ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానం పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీస్ కానిస్టేబుల్ (స్టైపెండరీ) అభ్యర్థుల దేహ దారుఢ్య పరీక్షలు ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానాన్ని ఆదివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేహ దారుఢ్య పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాల మేరకు ఎంపిక పరీక్షలు ఉంటాయని తెలిపారు. సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల ఎంపికకు సంబంధించి శారీరక కొలతలు, క్రీడాంశాల నిర్వహణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మైదానంలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. 100 మీటర్లు, 1600 పరుగు పందెం, లాంగ్ జంప్ జంప్ ట్రాక్‌లు పక్కాగా ప్రమాణాలతో సిద్ధం చేయాలన్నారు. మంచి నీటి సౌకర్యం, వైద్య సేవల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అరసవల్లిలో సహస్ర కలశాభిషేకం



ఆలయంలో సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం సహస్ర కలశాభిషేకం కార్యక్రమం ప్రారంభమైంది. అనివెట్టి మండపంలో ధనుస్సంక్రమణం సందర్భంగా 1000 కలశాలతో ఆలయ దోష నివారణ, శుద్ధి కార్యక్రమం కోసం అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమైన ఈ అభిషేక కార్యక్రమం సోమవారం సాయంత్రంతో ముగియనుంది. అలాగే ఆదివారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఒక్కరోజులో వివిధ దర్శన టికెట్ల ద్వారా రూ. 1,80,800, విరాళాల రూపంలో రూ.70,436, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2.20లక్షలు మేరకు ఆదాయం లభించినట్లు ఈఓ భద్రాజీ తెలిపారు.

పక్షుల విహార కేంద్రం పరిశీలన



టెక్కలి మండలం తేలినీలాపురం పక్షుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేవీవీ ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి మండలం తేలినీలాపురం గ్రామంలో గల విదేశీ పక్షుల కేంద్రాన్ని పరిరక్షించాలని జన విజ్ఞాన వేదిక పర్యావరణ కమిటీ ప్రతినిధులు కోరారు. ఆదివారం పక్షుల కేంద్రాన్ని పరిశీలించి అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్షుల కేంద్రాన్ని పరిరక్షించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిశీలనలో కె.రామారావు, కేవీవీ సత్యన్నారాయణ, కె.త్రిమూర్తులు, వి.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ పేరుతో వేధింపులు



పోలీసులను నిలదీస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- రాత్రివేళ రెండు కార్లతో ఎనిమిది మంది పోలీసుల అలజడి
- ఇంటికి వచ్చి ఇద్దరు వైఎస్సార్ సీపీ వర్గీయులను తీసుకెళ్లిపోయిన వైనం
- ఎక్కడకు తరలించారో చెప్పని పోలీసులు
- కాశీబుగ్గ స్టేషన్ ముందు బైఠాయించిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ:

పోలీసులు విచారణ పేరుతో వేధింపులు చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఇద్దరు వైఎస్సార్ సీపీ నాయకులను విచారణ పేరుతో తీసుకెళ్లి వారు ఎక్కడ ఉన్నారో చెప్పని వైనం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 7వ వార్డు చినబడాం గ్రామానికి చెందిన కూర్మాపు ధర్మారావు అనే సీఆర్పీఎఫ్ మాజీ జవాన్ వైఎస్సార్‌సీపీ నాయకుడిగా ఉన్నారు. విచారణ చేస్తామని రెండు వాహనాల్లో ముగ్గురు పోలీసులు, ఐదుగురు సివిల్ డ్రెస్‌తో ఉన్న వారు వచ్చి ఆయనను తీసుకెళ్లారు. అలాగే మందస మండలానికి అంపోలు శ్రీను అనే వ్యక్తిని సైతం ఇలాగే తీసుకుపోవడంతో ఆయా కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. వచ్చిన వారు పోలీసులేనా, పోలీసుల పేరుతో టీడీపీ నాయకులు కిడ్నాప్ చేశారా అని అనుమానం వ్యక్తం చేశారు. ఎప్పటికీ వారి గురించి ఎవరూ చెప్పకపోవడంతో కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు చేరుకుని సీఐ మోహనరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు తీసుకోకపోవడంతో కూర్మాపు ధర్మారావు కుమారుడు కూర్మాపు గోవిందు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు సమాచారం అందించారు. దీంతో ఆయన హుటాహుటిన రాత్రివేళ కాశీబుగ్గ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి పోలీసులతో మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులను స్వయంగా పోలీసులే కిడ్నాప్ చేశారని, ఆచూకీ తెలపాల్సిందేనని స్టేషన్ ముందు బైఠాయించారు. దాదాపు అర్ధరాత్రి వరకు ఈ ఆందోళన సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులే కిడ్నాపర్లు అయితే ఎలా అంటూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అనంతరం మాజీ మంత్రితో పోలీసులు మాట్లాడుతూ వారిద్దరూ తమ ఆధీనంలోనే ఉన్నారని చెప్పారు.



కాశీబుగ్గ స్టేషన్ ముందు బైఠాయించిన అప్పలరాజు, అనుచరులు

అమరజీవికి ఘనంగా నివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ ఆధ్యమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని పెద్దమార్కెట్ వద్ద ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ దండి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లోనూ ఆయన పాల్గొన్నారని గుర్తు చేశారు. నవంబర్ 1ని రాష్ట్ర అవతరణ దినోత్సంగా పాటించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జీఓ విడుదల చేసి ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలు చేసేవారని, కూటమి ప్రభుత్వంలో పూర్తిగా ఆ జీఓను రద్దు చేసి విస్మరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కళింగకుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యన్నారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, అంబటి నిర్మలాశ్రీనివాస్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రొతు శంకరరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, మండవల్లి రవి, ఎన్ని ధనుంజయరావు, గేదెల పురుషోత్తం, అంధవరపు రమేష్, కింజరాపు రమేష్, అరుణ్‌కుమార్, భాస్కరరావు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పొట్టి శ్రీరాములే స్ఫూర్తి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవిగా మనందరి మదిలో చిరస్థాయిగా మిగిలారని, అహింస, హరిజనోద్ధరణ కోసం పనిచేసిన ఆ మహనీయుడు చూపిన బాటలో మనందరం ముందుకు సాగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఆయన స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి హాజరయ్యారు. పొట్టి శ్రీరాములు గొప్పదనాన్ని వివరించారు.



పల్లెతల్లికి సంక్రాంతి కళ

- నేటి నుంచి ధనుర్మాస పూజలు
- నెల రోజుల పాటు గోదాదేవికి పూజలు
- గ్రామాల్లో హరిదాసులు, గంగిరెద్దుల సందడి

ఎల్ఎన్ పేట:

పల్లెతల్లికి సంక్రాంతి కళ వచ్చేసింది. సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుంది. ఈ నెలంతా వైష్ణవాలయాల్లో పాశురాల మంత్రాలతో గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలు సోమవారం తెల్లవారు జాము నుంచి ప్రారంభం కానున్నాయి. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించేందుకు ఆలయ అర్చకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి అంటే సోమవారం నుంచి భోగి పండగ రోజు వరకు గోదాదేవికి పూజలు నిర్వహిస్తారు. భోగీ రోజున గోదాశ్రీరంగనాథుల కల్యాణం ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే ఈనెల 26వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినం నాడు ప్రత్యేక పూజలతో పాటు ఉపవాస దీక్షలు చేస్తారు. ధనుర్మాసం ప్రారంభంతోనే నెలగంట మోగింది. ఈ రోజు నుంచే నెల రోజుల పాటు సంక్రాంతి సంబరాలు ప్రారంభం అవుతాయి. హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్న(గంగిరెద్దు)ల విన్యాసాలు, ఇంటి ముంగిట రంగవల్లులు, నోరూరించే పిండి వంటలతో సందడి నెలకొంటుంది.



ఎల్.ఎన్.పేట: ధనుర్మాస పూజలకు సిద్ధమైన శ్రీవెంకటేశ్వరస్వామి

సోమవారం తెల్లవారు జాము నుంచి ధనుర్మాసం ప్రారంభం అవుతుంది. ప్రత్యక్ష దైవంగా పూజలందుకునే సూర్యుడు ధనుస్సులోకి ప్రవేశించే శుభ గడియలో పుణ్యక్షేత్రాల్లో మోగించే గంటానాదాన్నే నెల గంట అంటారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేంత వరకు ఉండే పవిత్ర మాసాన్నే ధనుర్మాసం అంటారు. వైష్ణవ ఆలయాల్లో ప్రతి రోజు తెల్లవారు జామున 4గంటల నుంచి విశేష పూజలు నిర్వహిస్తారు.



పవిత్ర మాసం



ఈ ధనుర్మాసం అత్యంత పవిత్రమాసం. గోదాదేవి తన ఆరాధనను పూల మాలలుగా భావించి శ్రీరంగనాథునికి సమర్పించి ఆయనకు ధరింపజేయాల్సిన మాలను తనే ధరించి ఆయన కృపతో మోక్షాన్ని పొందారని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఆమెనే ఆండాళ్‌గా పిలుస్తారు. తిరుప్పావైలోని 30 పాశురాలను పారాయణం చేస్తారు. ఈనెలలో వచ్చే ముక్కోటి ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగనిద్ర నుంచి మేల్కొని ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారని పురాణాలు చెబుతున్నాయి.

– మొజ్జాడ కృష్ణమాచార్యులు, ప్రధాన అర్చకులు, శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, తురకపేట

క్లుప్తంగా

22న పాణిగ్రాహి స్మారక సభ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పలాస: విప్లవ కవి, ప్రజాసాంస్కృతిక ఉద్యమ యోధుడు సుబ్బారావు పాణిగ్రాహి 55వ స్మారక సభను విజయవంతం చేయాలని అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాణిగ్రాహి పోరాట జీవితం–వర్తమాన ప్రాసంగిత, ప్రాధాన్యం అనే అంశంపై ఏడు విప్లవ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డిసెంబరు 22న ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని పెద్దపాడు సమీపంలో వానవానిపేటలో స్మారక సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సి.పి.ఐ.ఎం.ఎల్.న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, పి.ఓ.డబ్ల్యూ జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ, పి.వై.ఎల్.జిల్లా కన్వీనర్ సార జగన్, గొరకల బాలకృష్ణ, కుత్తుం హేమక్క, బర్ల జానకమ్మ, బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, రాపాక మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిదేవికి పౌర్ణమి పూజలు



అమ్మవారికి పుష్పాభిషేకం

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: మండలంలోని కొంచాలకూర్మయ్యపేటలో దేవీ ఆశ్రమంలో ఆదివారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కర శర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీదేవికి పుష్పాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మహా మేరువులకు ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సూర్యనారాయణ (ఫైల్)

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేటకు చెందిన దన్నాన సూర్యనారాయణ(58) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోష్ట పంచాయతీ పైడిపేట సామిల్లులో పనిచేస్తున్న సూర్యనారాయణ ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై బయలుదేరి వస్తుండగా అదుపుతప్పి సర్వీస్ రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. రణస్థలం సర్వజనాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అక్కడ మృతి చెందాడు. సూర్యనారాయణకు భార్య జయమ్మ, వివాహమైన ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాకాసి అలలకు యువకుడు బలి



మృతదేహాన్ని వద్ద మెరైన్, మందస పోలీసులు

కాశీబుగ్గ : మందస మండలం రట్టి బీచ్‌లో ఆదివారం విషాదం నెలకొంది. హరిపురం గ్రామానికి చెందిన మహావీర్ సేన్ (30) అనే యువకుడు సముద్ర స్నానానికి దిగి రాకాసి అలల తాకిడి బలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్ జిల్లా బుల్లాడా మండలం బాల గ్రామానికి చెందిన మహావీర్ సేన్ బతుకు తెరువు కోసం మందస మండలం హరిపురానికి వలసవచ్చాడు. పాత జాతీయ రహదారి పక్కన జిలాబీలు, పకోడి వ్యాపారం చేసుకుంటూ సోదరి కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సరదాగా సముద్ర స్నానానికి వెళ్లి కొట్టుకుపోతుండగా స్థానికులు మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. కొద్దిసేపటి తర్వాత మృతదేహం ఒడ్డుకు కొట్టుకురావడంతో మందస ఏఎస్ఐ కంచు శేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని హరిపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- నిర్వాహకులు వివరాలు నమోదు చేసుకోవాలి
- నాకౌట్ టోర్నీలు, లీగ్ టోర్నీల్లో పాల్గొనేందుకు అవకాశం
- భవిష్యత్తులో ఏసీఏ సహకారంతో ప్రోత్సాహకాలు, కిట్లు అందజేత



శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానాన్ని జేసీబీ సాయంతో చదును చేస్తున్న దృశ్యం

క్రికెట్ క్లబ్‌ల సందడి

శ్రీకాకుళం న్యూకాలనీ:

క్రికెటర్లను ప్రోత్సహించేందుకు జిల్లా క్రికెట్ సంఘం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే క్రికెట్ మైదానాల అభివృద్ధిలో భాగంగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల మైదానం ఎంటయూలను పూర్తిచేసుకుని పనులు సైతం మొదలుపెట్టింది. ఈ క్రమంలో త్వరలో ప్రారంభమయ్యే క్రికెట్ టోర్నీల కోసం క్రికెట్ క్లబ్‌ల నమోదుపై దృష్టిసారించారు. ఇందుకోసం మైదానాలను జేసీబీలతో తీర్చేదిద్దే పనులను ముమ్మరం చేస్తున్నారు.

జనవరి నెలాఖరు వరకు అవకాశం..

త్వరలో జరిగే టీ–20 నాకౌట్ టోర్నమెంట్, జిల్లా క్రికెట్ లీగ్ మ్యాచ్‌లకు సంబంధించి క్రికెట్ క్లబ్‌ల నమోదుపై దృష్టిసారించారు. జనవరి నెలాఖరు వరకు ఔత్సాహిక క్రికెట్ క్లబ్‌లు వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీవైఎన్ శాస్త్రి, హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి



క్రికెట్ సాధన చేస్తున్న యువ క్రీడాకారులు

మదీనా శైలానీ, డాక్టర్ సువ్వారి రవికుమార్ పేర్కొన్నారు. నమోదు చేసుకున్న క్లబ్‌లకే వివిధ టోర్నీల్లో పాల్గొనే అవకాశంతోపాటు భవిష్యత్‌లో ఏసీఏ సహకారంతో ప్రోత్సాహకాలు, క్రికెట్ కిట్లను అందజేసే ఆలోచన చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

నమోదు ఇలా..

- క్లబ్‌కు ఎంచుకున్న పేరు, ఊరు పేరితో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- గ్రామ/ప్రాంతానికి చెంది క్రికెట్‌పై ఆసక్తి, అవగాహన, అనుభవం కలిగిన క్రీడాకారులు క్లబ్‌లో భాగస్వామ్యం కావాలి.
- కనీసం 20 మంది సభ్యులతో కూడిన జాబితా ఉండేలా చూసుకోవాలి.
- క్రీడాకారుల జనన ధ్రువీకరణ పత్రం (టెన్త్‌క్లాస్/ మున్సిపాలిటీ/ తహసీల్దార్/ పంచాయతీలు అందజేసినవి), ఆధార్ కార్డులు, రెండు పాస్‌ఫొటోలు సిద్ధం చేసుకోవాలి.
- ఈ వివరాలతోపాటు డాక్యుమెంట్లను జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో జనవరి నెలాఖరు వరకు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఆఫీస్ ఇన్‌చార్జి రవికిరణ్‌కు అందజేయాలని జిల్లా క్రికెట్ సంఘం మెంటార్ ఇలియాస్ మహ్మద్ పేర్కొన్నారు.
- రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక క్లబ్‌పేరు, ఊరు పేరుతో జిల్లా క్రికెట్ సంఘం ఒక రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందజేస్తుంది. క్లబ్‌కు చెందిన ఆటగాళ్లకు రెండు ఐడీ కార్డులను మంజూరు చేస్తారు. ఒకటి క్రికెటర్ వద్ద ఉంటుంది. మరొకటి క్రికెట్ సంఘం వద్ద ఉండనుంది.
- క్లబ్‌లో నమోదు చేసుకున్న ఆటగాళ్లు మాత్రమే జిల్లా క్రికెట్ సంఘం నిర్వహించే వివిధ క్రికెట్ టోర్నీలు, లీగ్ మ్యాచ్‌ల్లో పాల్గొనడానికి అర్హులవుతారని ఇలియాస్ స్పష్టం చేశారు.

10కే రన్‌లో ఈశ్వరరావుకు కాంస్యం



పతకంతో అన్నెపు ఈశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన మారథాన్ స్టార్ అన్నెపు ఈశ్వరరావు మరోసారి మెరిశారు. విశాఖపట్నంలో ఆదివారం వైజాగ్ నేవీ మారథాన్ నిర్వహించిన ఎయిర్‌క్రాఫ్ట్ 10 కిలోమీటర్ల మారథాన్ (లాంగ్‌రేస్ పరుగుపందెం)లో తృతీయ స్థానంలో నిలిచి సత్తాచాటారు. నిర్వాహకులు, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా కాంస్య పతకంతోపాటు నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ రిటైర్డ్ వార్డెన్ ఇప్పటికే పదుల సంఖ్యలో మారథాన్ పోటీల్లో పాల్గొని సత్తాచాటుతూ వస్తున్నారు. వీటితోపాటు మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాల పంట పండిస్తున్నారు. యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈయన పతకం రావడం పట్ల మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా సంఘం ముఖ్య ప్రతినిధులు బొడ్డేపల్లి నారాయణరావు, పాలకొండ అప్పారావు, చల్లా జగదీష్, భాగ్యలక్ష్మి, భాస్కరరావు, యశోద, ప్రసాద్ హర్షం వ్యక్తంచేశారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి చెస్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి చెస్ పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం నగరంలోని నానుబాలవీధిలో ఉన్న జిల్లా చెస్ శిక్షణా కేంద్రంలో ఆదివారం జరిగిన ఈ పోటీలకు 11 మంది ఇంటర్నేషనల్ రేటెడ్ ప్లేయర్స్‌తోపాటు వర్ధమాన క్రీడాకారులు హాజరై తమ మెదడుకు పదునుపెట్టారు. 6 రౌండ్లపాటు ఉత్కంఠగా సాగిన ఈ పోటీల్లో ఓపెన్ విభాగంలో కుప్పిలి సాయి వెంకట్ విజేతగా నిలిచాడు. చంద్రమౌళి ద్వితీయ, యశ్వంత్ తృతీయ, లక్ష్మణ్, వెంకటేష్, చిట్టిబాబు ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. జూనియర్స్ విభాగంలో బగాది కార్తికేయ, శృతి, రితిక్‌నాయుడు మొదటి మూడు స్థానాల్లో నిలిచి సత్తాచాటారు. విజేతలకు టోర్నీ డైరెక్టర్ బి.వసంతరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిడే ఆర్బిటర్ సనపల భీమారావు, జిల్లా చెస్ సంఘ అధ్యక్షుడు బగాది కిషోర్, అప్పాజీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ఉత్సాహంగా బాక్సింగ్, ఉషూ క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున అంతర విశ్వవిద్యాలయ క్రీడా పోటీల్లో పాల్గొనే బాక్సింగ్, ఉషూ క్రీడాకారులు ఎంపికలు వర్సిటీలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను వీసీ కె.ఆర్.రజిని ప్రారంభించారు. పంజాబ్ రాష్ట్రం గురుకాశీ విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి జనవరి 2 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. మహిళలకు ఛండీగఢ్ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 14 నుంచి 20 వరకు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు పి.జాన్ (ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల), సీహెచ్ జ్ఞానేశ్వరరావు (ఆదిత్య డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం), వై.దిలీప్, పి.ప్రసాద్ (విద్యాధరి డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం) ఎం.శిరీష (విద్యాధరి డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం), ఆర్.పావని (ప్రతిభా డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం) ఎంపికయ్యారు. పురుషుల పోటీలకు ఎం.ఉమామహేశ్వరరావు మేనేజర్‌గా, పి.విశ్వేశ్వరరావు కోచ్‌గా వ్యవహరిస్తారు. మహిళల బృందానికి కె.తారకరామ కోచ్‌గా వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ రాజశేఖర్‌రావు, పీడీ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికలను పరిశీలిస్తున్న వీసీ రజిని

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్ అపార్ట్‌మెంట్‌లో డెంటిస్ట్ గురుదేవ్ ఇంట్లో గత ఏడాది డిసెంబర్ 3న జరిగిన దొంగతనం కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసినట్లు నరసన్నపేట సీఐ జె. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా నారోలీ గ్రామానికి చెందిన సోహాస్ దావర్, ఆలీధర్ పూర్ జిల్లా బెడకత్వాల్ గ్రామానికి చెందిన చకోడియా చాగల్‌లను అరెస్టు చేశామని, మరో ముగ్గురు నిందితులు దొరకాల్సి ఉందన్నారు. చోరీకి గురైన బంగారు ఆభరణాలను మధ్యప్రదేశ్ లోనే విక్రయించినట్లు నిందితులు తెలిపారని, కొన్నవారి కోసం గాలిస్తున్నట్లు వివరించారు. వీరిపై విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం టౌన్ పరిధిలో 9 కేసులు ఉన్నాయని చెప్పారు. వీరి వద్ద ప్రస్తుతానికి కొన్ని వెండి వస్తువులు, రెండు తులాల 7 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా ఇందిరానగర్‌లోనే 97 తులాల బంగారాన్ని అప్పట్లో చోరీ చేశారు.

ఒక్క బైక్‌పై ఏడుగురు

ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఏకంగా ఏడుగురు ఒకే బైక్‌పై ప్రయాణం చేశారు. ఈ దృశ్యం కొత్తూరు మండలం ఓండ్రుజోల గ్రామం వద్ద ఆదివారం కనిపించింది. హెల్మెట్ లేకుండా పిల్లలతో కలిసి కిక్కిరిసి ప్రమాదకరంగా ప్రయాణించారు. బైక్‌పై ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణించడం ప్రమాదమని పోలీసులు చెబుతున్నా కొందరు బైకర్లు ఇలా ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. – కొత్తూరు



అ'పూర్వ' సమ్మేళనం



పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక స్థానిక రాంబిల్లి నాగరాజు తోటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో సందడిగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. చివరిగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఎక్సెలెన్స్ అవార్డులు అందుకున్న ఎంవీఎస్ శాస్త్రిని సత్కరించారు. – పొందూరు

మాజీ సైనికులకు సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: మాజీ సైనికుల సేవలో 30 ఏళ్లపాటు సుదీర్ఘమైన ప్రయాణం చేసి విరమిస్తున్న ఆమదాలవలస మాజీ సైనికుల ప్రెసిడెంట్ సూర అవతారంతో పాటు మాజీ సైనిక సంఘాల అధ్యక్షులు పొట్నూరు గోవిందరాజు (సింగుపురం), తాళ్ల పాపారావు(సతివాడ), నారంశెట్టి సురేష్ (రాజాం), ఎల్.వెంకటరావు (పొన్నాడ), నారాయణ (ఫరీదుపేట), పైడి రంగనాథం(కింతలి), సీనియర్ వీరనారి దన్నాన లక్ష్మీకాంతమ్మలను ఆదివారం ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రంలోని పెద్దరెల్లివీధిలో డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మేన్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, చైర్మన్ పి.ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు బి.సంజీవరావు, ఎస్.లక్ష్మణరావు, తర్రా కృష్ణారావు, ఉపాధ్యక్షుడు వి.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ పి.మురళీధర్‌రావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, కరస్పాండెంట్ తాండ్ర జనార్దన్, సలహాదారులు బట్న మూర్తి, పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికులను సత్కరిస్తున్న దృశ్యం

వివాహిత ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: స్థానిక అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో నివాసముంటున్న ఓ వివాహిత ఆదివారం ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబంలో వచ్చిన చిన్నపాటి తగాదా కారణంగా మనస్తాపానికి గురైన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫినాయిల్ తాగినట్లు స్థానికులు చెబుతున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను టెక్కలి జిల్లాఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

భూవివాదంలో ఇరువర్గాల కొట్లాట

రణస్థలం: మండలంలోని ఎన్.జి.ఆర్.పురం పంచాయతీ చీకటిపేట గ్రామానికి చెందిన తండ్రీ కుమార్తె మధ్య జరిగిన భూ వివాదం ఇరువర్గాల కొట్లాటకు దారితీసింది. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీకటి రామారావు, అతని కుమార్తె ధనలక్ష్మికి మధ్య కొన్నాళ్లుగా భూవివాదం నడుస్తోంది. కుమార్తెకు తెలియకుండా తండ్రి అదే పంచాయతీకి చెందిన రామప్పుడు అనే వ్యక్తికి భూమిని అమ్మేశాడు. దీనిపై కుమార్తె ఇటీవల రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం ఓ వర్గానికి చెందిన 14 మంది, మరో వర్గానికి చెందిన 22 మంది కొట్లాటకు దిగారు. కొందరు గాయపడటంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జె.ఆర్.పురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కొంతమందిని అరెస్టు చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులు మేరకు ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలం వద్ద ఎస్సై చిరంజీవి, సిబ్బంది

ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి

గార: ఐకమత్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గార మండలం అంపోలు పంచాయితీ పరిధిలోని జిల్లా వెలమ సంఘం ఆధ్వర్యంలో వెలమల భోజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన పేద మధ్య తరగతి విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడంతో పాటు ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. అనంతరం చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఐఈఎస్ పరీక్షల్లో రెండో స్థానం సాధించిన గొల్లంగి సతీష్‌ను ఘనంగా సత్కరించారు. వెలమ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, కింజరాపు ప్రసాద్, కింజరాపు ప్రభాకరరావు, వెలమ సంఘ ప్రతినిధులు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వెలమ కులస్తులు పాల్గొన్నారు.



వనభోజన మహోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వెలమ సభ్యులు

రమణ మోసాలు తెలిసి అవాక్కయ్యాం

- ఆర్మీ కాలింగ్ సెంటర్ ఏఓ ఆవేదన

శ్రీకాకుళం క్రైమ్ : ఆర్మీకాలింగ్ సెంటర్ ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే అనేక సాంకేతిక ఆధారాలైన పెన్‌డ్రైవ్‌లు, సీపీయూలు, సిస్టమ్‌లు, హార్డ్‌డిస్క్‌లు, డేటా స్టోరేజ్‌లే కాక ఇతర ఆధారాలైన ఫేక్ ఫొటో ఐడీకార్డులు, ఫేక్ ఆర్మీ సర్టిఫికెట్లు, ముఖ్య డాక్యుమెంట్లను సంపాదించిన పోలీసులు.. రిమాండ్‌లో ఉన్న రమణను కస్టడీకి కోరినట్లు తెలుస్తోంది. మరోవైపు ఏఓగా పనిచేసిన వ్యక్తి రమణ మోసాలను మాజీ ఆర్మీ, నేవీ ఉద్యోగుల వద్ద చెప్పి వాపోయారు.

ఆది నుంచీ గొడవలే..

13 నెలల ముందు ఆర్మీకాలింగ్‌సెంటర్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)గా చేరిన వ్యక్తి 103 మంది విద్యార్థులను చేర్పడంలో కృషిచేశారు. రూ.లక్షల్లో డబ్బులు వచ్చినా తనకు రూపాయి కూడా ఇవ్వలేదని, రమణ అక్రమాలు ఇప్పుడు బయటపడటంతో తానేంటో తెలుసొచ్చిందని ప్రస్తుతం ఆర్మీకాలింగ్ సెంటర్‌లో బిక్కుబిక్కుమంటూ ఉన్న పేద విద్యార్థుల నిర్వహణను చూస్తున్న ఏవో, ఓ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ వాపోతున్నారు. రమణ ఆకృత్యాలు బయటపడ్డాక డీఎస్పీ విచారణకు పిలిచినప్పుడు మొత్తం అడ్మిషన్ వ్యవహారాలు తానే చూసుకున్నట్లు చెప్పి రమణ తనను ముందుకు తోసి వెనక్కి నక్కిపోయాడన్నారు. రమణ వెనుక పెద్ద పెద్ద అధికారులు, ప్రముఖులను చూసి తానూ ఆకర్షితుడినయ్యానని, అందులోనూ అకాడమీకి ప్రభుత్వ స్థలం రానుందని చెప్పడం, పేద విద్యార్థుల భవితను నిలబెడతాడనే ఆశతోనే రమణ వెనుక ఉండాల్సి వచ్చిందని ఏవో పేర్కొన్నారు. రమణ ఆకృత్యాలు బయటపడి డీఎస్పీ తమ సిబ్బందిని పిలిచి సంస్థకు, వసతిగృహానికి ఎటువంటి అనుమతులు (మెరిట్స్, ఫుడ్‌లైసెన్సు, ట్రేడ్‌లైసెన్సు, లేబర్ సర్టిఫికేట్, కేంద్ర ప్రభుత్వం ఆర్డర్స్, ఫండ్స్, రిజిస్ట్రేషన్) లేవని, అసలు రమణ ఆర్మీలోనే పనిచేయలేదని చెప్పడంతో అవాక్కయ్యామన్నారు. రమణను ఇదే విషయం అడిగితే అదో పెద్ద స్టోరీలే అంటూ తప్పించుకున్నాడన్నారు. తాను ఎవరెవరి దగ్గరో డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, వాస్తవానికి తన తరఫున ఒక విద్యార్థి రూ.7.50 లక్షలు, మరొక విద్యార్థి రూ.1.50 లక్షలు రమణకు ఇచ్చారన్నారు. దీనికి రూ. 6 వడ్డీకి ఆరు ప్రాంసరీ నోట్లు రమణ చేత రాయించానని, సాక్షులుగా తనతో పాటు సెంటర్‌లో పనిచేసే కొంతమంది సంతకాలు పెట్టామని చెప్పారు. ఇలానే చాలా మంది తనకు తెలియకుండానే రమణకు డబ్బులు ఇచ్చారని, ఈ ఒక్క ఏడాది సుమారు రూ. కోటి వరకు ఆదాయం అకాడమీకి సమకూరినట్లు తెలిపారు. రూరల్ పీఎస్, వన్‌టౌన్ పీఎస్, సర్కిల్ సీఐ, డీఎస్పీలు రోజుకు మూడు నుంచి నాలుగు సార్లు విచారణకు గత ఆరు రోజులుగా పిలుస్తున్నారని, ఈ విషయం తెలిసి తన భార్య, పిల్లలు పుట్టింటికి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థలో 120 మందిలో 80 మంది నిరుపేద విద్యార్థులున్నారని, వారి తల్లిదండ్రులు శనివారం సమావేశానికి వచ్చి ఫీజు బకాయిల విషయమై తనను నిలదీశారని వాపోయారు. తన వ్యక్తిగత ల్యాప్‌టాప్‌ను నాశనం చేశాడని, తనకు బెయిల్ ఇమ్మని అడిగినా నిరాకరించానని చెప్పారు.



గత సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చిన ఆర్మీకాలింగ్ సెంటర్ బాధితులు

ఇండియన్ ఆర్మీకాలింగ్ ఏఓ రాజీనామా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంగా ఇండియన్ ఆర్మీకాలింగ్‌లో ఇటీవల జరుగుతున్న వరుస ఉదంతాలతో ఆ సెంటర్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)గా పనిచేస్తున్న చిందు శ్రీకాంత్ రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రమణ అరెస్టు కావడం, ఐఏసీ అకౌంట్‌లో ఒక్క రూపాయి లేనందున విద్యార్థులకు భోజన సదుపాయాలకు వారం రోజులుగా ఇబ్బందిగా ఉందని, ఎన్ఆర్ఐ కళాశాలకు మూడో టెర్మ్ ఫీజు బకాయి ఉందని, ఈ పరిస్థితిలో సెంటర్‌ను నడపలేమంటూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.